ప్రజాశక్తి
ఆదివారం 31 మార్చి 2024
5
అల్లూరి సీతారామరాజు

ఈశ్వరికే పాడేరు టిక్కెట్ కేటాయించాలి

ప్రజాశక్తి-చింతపల్లి : పాడేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిత్వం గిడ్డి ఈశ్వరికే కేటాయించాలని ఆ పార్టీ నాయకుడు గొర్లెడ్డి సోమేశ్వరరావు కోరారు. ఆ పార్టీ నాయకుడు కోడా సురేష్‌తో కలిసి మాట్లాడుతూ కూటమిలో భాగంగా ముందుగా పాడేరు నియోజకవర్గం బిజెపికి కేటాయించినప్పటికి ఆ పార్టీకి ఈ నియోజకవర్గంలో ఆశించిన కేడర్ లేకపోవడంతో, అరకు స్థానాన్ని ఆ పార్టీ తీసుకుని పాడేరు స్థానాన్ని టిడిపికి విడిచిపెట్టిందన్నారు.

ఈనేపథ్యంలో పాడేరు ఎమ్మెల్యే టిక్కెట్ గిడ్డి ఈశ్వరికి కేటాయించడం సబబన్నారు. గడచిన ఐదేళ్లుగా పాడేరు నియోజకవర్గంలో టిడిపి బలోపేతానికి గిడ్డి ఈశ్వరి విశేషకృషి చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఈశ్వరికి టిక్కెట్ ఇస్తే అందరం మరింత కష్టపడి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. వేరొకరికి టిక్కెట్ కేటాయించడం సరికాదన్నారు.

సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న సిపిఎం జెడ్పిటిసి గంగరాజు

ప్రజాశక్తి - అనంతగిరి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అరకు నియోజకవర్గ పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో సిపిఎం బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీ ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ జెడ్పిటిసి దీసరి. గంగరాజు పిలుపునిచ్చారు శనివారం ఎగువశోభ పంచాయతీ మర్రిగుడ గ్రామంలో ప్రచారసభ నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారసభలో గంగరాజు మాట్లాడుతూ ప్రజల పక్షాన నుంచుని నిరంతరం వారి సమస్యల పరిష్కారానికి కృషి పోరాటం చేస్తున్న సిపిఎం అభ్యర్థులను ఎంపి, ఎమ్మెల్యేలుగా గెలిపించి చట్టసభలలో పంపించాలని కోరారు, 1/70, పీసా చట్టాల పక్కా అమలు, జిఒ3 పునరుద్దరణ, ఇతర గిరిజన సమస్యల పరిష్కారానికి సుత్తి,కొడవలి, చుక్క నక్షత్రం గుర్తుపై ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా ఓటు వేయడమెలాగో గిరిజనులకు అవగాహన కల్పించారు. పార్టీ కార్యకర్తలు జె.సుబ్బారావు, ఎస్ గంగులు, జె రామన్న, రాజు, రాము, అర్జున్, భీమన్న, దేముడమ్మ, దేవి, అనంతగిరి, ఎగువశోభ పంచాయతీ గిరిజన ప్రజలు పాల్గొన్నారు

చొంపి రోడ్డుపై నిండా నిర్లక్ష్యం!

- నేతలు, అధికారుల నిర్వాకంతో ప్రజలకు కష్టాలు
- సిపిఎం అభ్యర్థుల విజయంతోనే సమస్యలకు చెక్
- జెడ్పిటిసి గంగరాజు, సిపిఎం నేత సురేంద్ర

చొంపి రోడ్డును పరిశీలిస్తున్న సిపిఎం నేతలు సురేంద్ర, గంగరాజు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం గిరిజనులను తీవ్ర అవస్థలకు గురిచేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, అనంతగిరి సిపిఎం జెడ్పిటిసి దీసరి గంగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం అరకులోయ మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న చొంపి గ్రామానికి వెళ్లిన సందర్భంగా అక్కడి అధ్వాన రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులను గుంతలమయమైన రోడ్డుతో తాము పడుతున్న ఇబ్బందులను సిపిఎం నేతలు దృష్టికి తెచ్చారు.ప్రయాణసంకటంగా ఉన్న రహదారిలో నిత్యం బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పట్టుకుని రాకపోకలు సాగిస్తున్నామని, దీనిపై పలుమార్లు నేతలకు, అధికారులకు విన్నవించినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సిపిఎం నేతలు కిల్లో సురేంద్ర, దీసరి గంగరాజు మాట్లాడుతూ, అరకు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో సిపిఎం అభ్యర్థులు వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, వారిని గెలిపిస్తే అరకువేలి నుండి చొంపి, బస్కి వరకు రహదారితో పాటు అన్ని సమస్యలు పరిష్కారమౌతాయన్నారు. అరకువేలి నుండి చొంపి వరకు గుంతలమయమైన రోడ్డులో రాకపోకలకు కార్లు, జీపులు, వ్యాన్లు, బైకులతోపాటు ఇతర ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు విముక్తి కలిగేలా తారురోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఇంత దారుణంగా ఉన్న చొంపిరోడ్డు ప్రస్తుత ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణకు కనిపించలేదాయని ప్రశ్నించారు. స్థానికంగానూ, రాష్ట్రంలోనూ ఒకేపార్టీకి చెందిన నేతలు అధికారంలో ఉన్నప్పటికీ చొంపిరోడ్డుతోపాటు గిరిజన సమస్యలపై స్థానిక ఎంపి, ఎమ్మెల్యేలు కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న రోడ్డు దుస్థితి ఇంత అధ్వాన్నంగా ఉంటే మారుమూల గ్రామాల్లో రోడ్లు, ఇతర సౌకర్యాల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో ఇట్టే ఊహించుకోవచ్చన్నారు. పదవుల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేసే సిపిఎం అభ్యర్థులకు వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా ఓట్లేసి గెలిపించి, చట్టసభలకు పంపిస్తే, గిరిజనులందరికీ జవాబుదారీగా ఉండి సేవలు అందించడానికి ఆస్కారమేర్పడుతుందన్నారు. దీనిపై గిరిజనులు అవగాహన పెంచుకుని సిపిఎం అభ్యర్థులను మంచిమెజార్టీతో గెలిపించాలని కిల్లో సురేంద్ర, దీసరి గంగరాజు పిలుపునిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత లోతా రామారావు

సిపిఎం గెలుపుతోనే నియోజకవర్గం అభివృద్ధి

ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు

ప్రజాశక్తి-విఆర్.పురం

రంపచోడవరం నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడే సిపిఎం అభ్యర్థి గెలుపుతోనే ఈ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు అన్నారు. మండలంలోని తెల్లవారిగూడెం, మొనకనపల్లి గ్రామాల్లో లోతా రామారావుతో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఇతర సిపిఎం నాయకులు పర్యటించి, అక్కడి పరిస్థితులను ఆడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సిపిఎం అభ్యర్థులకు ఆస్తులు వద్దు, కారులు వద్దు, బంగాళాలు వద్దేవద్దు.. నియోజకవర్గమే ఇల్లుగా, పార్టీ కార్యాలయాలే చాంబర్లుగా, అసెంబ్లీయే దేవాలయంగా, ప్రజలే నాకు దేవుళ్లుగా భావించి ప్రజలకు సేవ చేస్తారని చెప్పారు. సిపిఎం నాయకులు ఆకలేస్తే గంజి నీళ్ల తాగైనా ఉంటారు తప్పా అవినీతికి, డబ్బుకు కక్కుర్తిపడే నైజం ఎక్కడా కానరాదని పేర్కొన్నారు. ఒక్కసారి ఆలోచించండి సుత్తి కొడవలి, నక్షత్రం గుర్తుకు ఓటు వేసి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా సభ్యులు పల్లపు వెంకట్, ములకనపల్లి సర్పంచ్ సవలం మారయ్య, నూనె నాగేశ్వరరావు, సవలం కన్నయ్య, నూనె సమ్మయ్య, బంగారు వినోద్, నూనె రాజు, నూనె జోగారావు, తెల్లం కన్నారావు, తెల్లం శాంతి రాజు, మాజీ సర్పంచ్ తెల్లం కన్నమ్మ, వెట్టి చంద్రరావు, సొంది. రాజయ్య, సొంది శంకరయ్య, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్యం టిడిపిలో ముసలం!

- అభ్యర్థుల ఖరారుపై భగ్గుమంటున్న పార్టీ శ్రేణులు
- సీనియర్లకు ఛాన్సివ్వకుంటే ఓడిస్తామని హెచ్చరిక
- పోటాపోటీగా సదస్సులు, సమాలోచనల్లో నేతలు

విలేకర్లతో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి మణికుమారి

1**ప్రజాశక్తి-పాడేరు:** సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదలై, పోటీ అభ్యర్థుల ఖరారుతో మన్యం తెలుగుదేశం పార్టీలో ముసలం నెలకొంది. టిక్కెట్లు కేటాయింపు తీరుపై టిడిపి శ్రేణులు తీవ్ర వ్యతిరేకత, నిరసన వ్యక్తం చేస్తున్నారు. అరకు, పాడేరు ఎమ్మెల్యే స్థానాల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు పార్టీ అధిష్టానం మొండిచేయి చూపడంపై సర్వత్ర ఆగ్రహావేశాలు వ్యక్తమౌతున్నాయి.

శనివారం పాడేరులో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, సీనియర్ నాయకులు మాజీ మంత్రి మణికుమారి తదితరులు వేర్వేరుగా మీడియా సమావేశం నిర్వహించి అభ్యర్థుల ఎంపికపై అధిష్టానం తీరును దుయ్యబట్టారు.

టిడిపి సీనియర్ నేత, మాజీ మంత్రి మణికుమారి, ఇతర నేతలు ఎంవీఎస్ ప్రసాద్, కొట్టగుల్లి సుబ్బారావు, వంజంగి కాంతమ్మ, బొర్రా నాగరాజు, విజయరాణి తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పార్టీలో కనీసం అర్హత లేని వ్యక్తికి టికెట్ ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. టిడిపి పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించిన రమేష్‌నాయుడు పార్టీలోకి వచ్చి మూడు నెలలే అయిందని, ఏం అర్హతలు చూసి అతనికి టిక్కెట్ కేటాయించారో చెప్పాలన్నారు. రమేష్ నాయుడు దగ్గర భారీగా ముడుపులు తీసుకుని టికెట్ కేటాయించినట్లు కేడర్ సందేహం వ్యక్తం చేస్తోందన్నారు. దీనిపై పార్టీ పునరాలోచన చేసి సీనియర్లకే టికెట్ కేటాయించాలని డిమాండ్ చేసారు. టిడిపి డబ్బులకు ఆశించే టికెట్లు కేటాయిస్తోందన్న అపవాదు రాకుండా అధిష్టానం మేలుకోవాలన్నారు. పాడేరు నియోజకవర్గంలో ఎన్ని పంచాయతీలు, ఎన్ని బూత్ కమిటీలు ఉన్నాయో తెలియని వ్యక్తికి టికెట్ కేటాయించడం ఎంతమాత్రం సరికాదన్నారు. అధినేత చంద్రబాబుకు తప్పుడు నివేదిక సమర్పించి టికెట్టు పొందారన్నారు.పార్టీ బి-ఫారం ఇచ్చేంతవరకు తమ ప్రయత్నాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి వేరుగా మీడియాతో పార్టీ కోసం సుదీర్ఘకాలంగా సేవ చేస్తున్న తనకు టికెట్ కేటాయించకపోవడంపై కన్నీటి పర్యంతమయ్యారు. ఏళ్ల తరబడి పార్టీ కోసం తాను కష్టపడితే, ఏ సర్వే ప్రకారం రమేష్ నాయుడుకు టిక్కెట్ కేటాయించారని ప్రశ్నించారు. దీనిపై చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు.. తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం లేని వ్యక్తి రమేష్‌నాయుడు లాబీయింగ్ చేసి టికెట్ పొందారని ఆరోపించారు. అధిష్టానం పునరాలోచన చేసి టికెట్ తనకు కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి డిమాండ్ చేశారు. లేదంటే టిడిపి అభ్యర్థి రమేష్‌నాయుడును కచ్చితంగా ఓడించి తీరుతామని స్పష్టం చేశారు.

ప్రణాళికాయుతంగా ఎన్నికల నిర్వహణ

- నోడల్ అధికారులకు డిఆర్ఒ పద్మావతి ఆదేశం

ప్రజాశక్తి - పాడేరు: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ ప్రక్రియను సజావుగా, విజయవంతంగా నిర్వహించేందుకు తగిన ప్రణాళికలు రచించుకొని సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లా రెవెన్యూ అధికారి బి. పద్మావతి ఎన్నికల నోడల్ అధికారులకు సూచించారు. శనివారం డిఆర్ఓ చాంబర్‌లో జిల్లాలోని వివిధ నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో. పలు అంశాలపై చర్చించారు. ఆయా నోడల్ అధికారుల సమక్షంలో ఇప్పటి వరకు జరిగిన ఏర్పాట్లు, తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ మేన్ పవర్, మెటీరియల్, ఇవిఎంల మేనేజ్‌మెంట్ తదితర ప్రక్రియల్లో చురుగ్గా ఉండాలని, ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. త్వరలో తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ జరుగుతుందని, తర్వాత ఎన్నికల సిబ్బందికి తొలి విడత శిక్షణ ఉంటుందనివెల్లడించారు. ఈ మేరకు ఆయా నోడల్ అధికారుల సమక్షంలో చేయాల్సిన ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ నిమిత్తం ఏర్పాటు చేసిన అన్ని విభాగాల నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని సూచించారు. సమావేశంలో ఎస్‌డిసి వివిఎస్ శర్మ, నోడల్ అధికారులు ఎం. శివయ్య, పి గోవిందరాజులు, పి. రాములు, వెంకటరావు, ఎం. అప్పారావు, వివిధ విభాగాల నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'పది' మూల్యాంకనం

- కలెక్టర్ చొరవతో తొలిసారి జిల్లాలో వాల్యుయేషన్
- జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు

తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో మాట్లాడుతున్న డిఇఒ

ప్రజాశక్తి -పాడేరు : ఏప్రిల్ ఒకటో తేదీ సోమ వారం నుంచి జిల్లా కేంద్రంలో పది పరీక్షా పత్రాల మూల్యాంకనం ప్రారంభమవుతుందని, జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీరావు తెలిపారు.. శనివారం స్థానిక తలారిసింగి ప్రభుత్వ గిరిజనసంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. సహాయ సంచాలకులు వినయ్ మోహన్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శశికుమార్ కలిసి టెన్త్ మూల్యాంకన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇఒ బ్రహ్మాజీరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఎం. విజయసునీత చొరవతో మొట్టమొదటి సారిగా జిల్లాలో పదవ తరగతి మూల్యాంకన జరుగుతోందన్నారు. రాష్ట్రంలో 25 జిల్లాలలో మూల్యంకన ప్రక్రియ నిర్వహించడానికి ప్రభుత్వం నిర్దేశించిందని, అందులో భాగంగానే అల్లూరి జిల్లాకు సంబంధించి స్థానిక తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఏప్రిల్ 1వ తేదీ నుండి 8వ తేదీ వరకు ఐదు సబ్జెక్టుల టెన్త్ జవాబు పత్రాల మూల్యాంకన జరుగుతుందన్నారు. ఇక్కడ మూల్యాంకన నిర్వహించడానికి రెగ్యులర్,ప్రైవేటు విద్యార్థులకు సంబంధించిన 90 వేల జవాబు పత్రాలను కేటాయించారన్నారు.. మూల్యాంకనకు 520 మంది ఉపాధ్యాయులను, సిబ్బందిని కేటాయించారన్నారు. వేసవిని దష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఆదేశాల మేరకు మూల్యాంకన కేంద్రంలో తాగునీరు, వైద్య సౌకర్యం ఏర్పాటు చేసామని స్పష్టం చేసారు. మూల్యాంకన కేంద్రం వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసామన్నారు. పారదర్శకంగా మూల్యాంకన నిర్వహిస్తామన్నారు.

కంగాల రంగయ్య స్థూపం ఆవిష్కరణ

ప్రజా ఉద్యమాలను విస్తృతం చేయడమే నిజమైన నివాళి : సిపిఎం నేతలు

స్థూపాన్ని ఆవిష్కరించి, రంగయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-చింతూరు

ప్రజా ఉద్యమాలను మరింత విస్తృతం చేయడమే కంగాల రంగయ్యకు మనమిచ్చే నిజమైన నివాళి అని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్ అన్నారు. మండలంలోని పేగ పంచాయతీ మాజీ సర్పంచ్, సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ కంగాల రంగయ్య స్థూపాన్ని ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యాన శనివారం సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన రంగయ్య సంస్మరణ సభలో సురేష్, వెంకట్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీల అభివృద్ధి సిపిఎంతోనే సాధ్యమైందన్నారు. తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం, ఇతర వసతులు సిపిఎం ప్రజాప్రతినిధులే ఏర్పాటు చేశారని, తరువాత వచ్చిన పాలకులు ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని విస్మరించారని పేర్కొన్నారు. నేటి పాలకులు కనీస అవసరాలను కూడా తీర్చలేని దుస్థితిలో ఉన్నారన్నారు. కామ్రేడ్ రంగయ్య కమ్యూనిస్టు పార్టీ అమరజీవులు చూపించిన పోరు బాటలో చురుకైన పాత్ర పోషించి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్తా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కంగల రమేష్, కంగాల లక్ష్మయ్య, మడకం కన్నయ్య, కంగాల చంటి, మల్లం సుబ్బమ్మ, సాలం కన్నయ్య, సవలం దేవయ్య, ఎంపీటీసీ రాజ్‌కుమార్, సిపిఎం నాయకులు కారం సుబ్బారావు, దిలీప్, గుర్రం పిడగయ్య, మొత్తం కిట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ సామగ్రి, నిత్యావసరాలు అందిస్తున్న జమాల్‌ఖాన్ తదితరులు

అగ్ని ప్రమాద బాధితులకు ఇంటి నిర్మాణ సామగ్రి వితరణ

ప్రజాశక్తి -ఎటపాక : మండలంలోని విస్సాపురం గ్రామపంచాయతీ పరిధి సాలె బుడప గ్రామంలో రెండు వారాల క్రితం కొవ్వాసి రామయ్య సోమిడి దంపతుల ఇల్లు అగ్ని ప్రమాదానికి గురై కాలిపోవడంతో వారికి ఇంటి నిర్మాణ సామగ్రిని జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు సమకూర్చింది. ఈ మేరకు ఇంటి నిర్మాణానికి కావలసిన సిమెంటు రేకులు, ఇనుప పైపులు, వంట పాత్రలు, 10 కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార, మంచి నూనె, కారం తదితర నిత్యాసరాలను బాధితులకు శనివారం ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మానవతా దృక్పథంతో ఆదుకోవాలన్నారు. కులాలు, మతాలు వేరైనా మనుషులందరూ ఒకటేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెకెసి ట్రస్ట్ ఇన్చార్జి సయ్యద్ సుభాని, గ్రామస్తులు పర్శిక ధర్మరాజు, ట్రస్ట్ సభ్యులు అబ్బర్ ఖాన్, అజీజ్, నటరాజ్ పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్ సువార్త ర్యాలీ

ప్రజాశక్తి-అడ్డతీగల : యేసుక్రీస్తు మరణ పునరుత్థాన ఈస్టర్ పర్వదినం సందర్భంగా మండల కేంద్రంలో ఆరాధన టీవీ ఛానల్ సౌజన్యంతో కో-ఆర్డినేటర్ పి.ఆరోగ్య రాజు ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ సువార్త ర్యాలీ శనివారం నిర్వహించారు. స్థానిక బీర్షెబా ప్రేయర్ హౌస్‌లో అల్పాహార విందుతో ప్రారంభించి షాలోం మందిరంలో ప్రేమ విందుతో ఈ కార్యక్రమాన్ని ముగించారు. ఈ రన్ ఫర్ జీసస్ సువార్త ర్యాలీని నినాదాలు, భక్తి పాటలు, దేవుని వాక్యాలతో అడ్డతీగల పురవీధుల్లో నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక దేవుని సేవకులు నిస్సి కుమార్, రాజు కుమార్, పాల్ లూధరన్, పాస్టర్ భూషణం, ఎ.ప్రకాష్‌రావు, ప్రభాకర్, భూషణం, విజయరాజు అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు. ప్రేమ విందును షాలోం చర్చ్ పాస్టర్ రామకృష్ణ, సభ్యులు ఏర్పాటు చేశారు.

విఆర్.పురం : యేసుక్రీస్తు మరణ పునరుత్థాన గుర్తుచేస్తూ మండల కేంద్రంలో శనివారం రోజున ఆరాధన టీవీ సౌజన్యంతో పెద్ద మట్టపల్లి పాస్టర్ ఎం బోఏజ్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ సువార్త ర్యాలీ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు డేవిడ్ లివింగ్స్టన్, జోనస్, సువర్ణ రాజ్ జీవం ఎన్నోస్ అమృత రావు, పలు సంఘాలు విశ్వాసులు పాల్గొన్నారు.

అడ్డతీగలలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది

ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలోని పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వో కార్యాలయం నుండి స్థానిక పోలీస్ స్టేషన్ కూడలి వరకు శనివారం స్వీప్ కార్యక్రమంపై భారీ ర్యాలీ నిర్వహించారు. 'మీ ఓటును నోటుకు అమ్ముకోవద్దు, స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరు ఓటును వినియోగించుకోవాలి' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల తహశీల్దార్ ఎ.వెంకట రమణ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటును నమోదు చేసుకోవాలని, ప్రలోభాలకు లోను కాకుండా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 80 సంవత్సరాలు నిండిన వారికి ఇంటి వద్ద నుండే ఓటు వినియోగించుకునేలాగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఎస్ఐ రాము మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి అవంతరాలు జరగకుండా ఎన్నికలకు సహకరించాలని కోరారు. అసాంఘిక కార్యక్రమాలకు, గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి తమ్మారావు, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, ఐసిడిఎస్ సిబ్బంది, మండల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలు శాఖల అధికారులు, పాల్గొన్నారు.

1 నుండి దారాలమ్మ 58వ వార్షిక మహోత్సవాలు

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలంలోని దారాలమ్మ అమ్మవారి 58వ వార్షిక మహోత్సవాలు ఏప్రిల్ ఒకటి నుంచి నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ ఈవో సాంబశివరావు వెల్లడించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ 1న సోమవారం ఉదయం 7.54 గంటలకు ముహూర్తపు రాట, అదే రోజు ఉదయం 9.22 గంటలకు గరగలు అలంకరణ చేయడం జరుగుతుందని చెప్పారు. 8న అమ్మవారి ప్రధాన పండగ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కలు తీర్చుకుంటారని తెలిపారు. అదే రోజు సాయంత్రం అమ్మవారి ఆలయం తలుపులు మూసి వేయడం జరుగుతుందని, 9న ఉదయం 7.15 గంటలకు అమ్మవారి గర్భగుడిలో శుద్ధిచేసి తిరిగే అమ్మవారు నిజరూప దర్శనాన్ని భక్తులు కలిగిస్తారని పేర్కొన్నారు. పండగ ప్రారంభం నుంచి చివరి వరకు అమ్మవారి సన్నిధిలో పలు సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఉచిత అన్న సమారాధన, అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో సాంబశివరావు తెలిపారు.

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-అడ్డతీగల

మండల కేంద్రం అడ్డతీగల సినిమా హాల్ కాలనీ, వాల్మీకి నగర్, కార్పెంటర్ కాలనీ, అల్లూరి సీతారామరాజు కాలనీ తదితర ప్రాంతాల్లో రంపచోడవరం వైసిపి అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మిని గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పిటిసి, సొసైటీ అధ్యక్షుడు తోటరాజేశ్వరావు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలిబుడపలో సోలార్ లైట్లు పంపిణీ

ప్రజాశక్తి-చింతూరు

విద్యుత్ సౌకర్యం లేని గొత్తికోయ తెగవారు నివాసముండే ఎటపాక మండలం, విస్సాపురం పంచాయితీ పరిధి సాలిబుడప గ్రామంలో 30 కుటుంబాలకు ఆశ సంస్థ ఆధ్వర్యాన సోలార్ లైట్లను పంపిణీ చేశారు. ఈ గ్రామంలో కుటుంబాలు గత కొన్నేళ్ళుగా విద్యుత్ సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. వారి సమస్యలను గుర్తించిన ఆశ సంస్థ గ్రామంలోని 30 కుటుంబాలకు సోలార్ లైట్లను శనివారం అందించింది. లైట్లు వాడే విధానం, ఛార్జ్ చేసుకునే పద్ధతిని సంస్థ కార్యదర్శి సయ్యద్ సుభాని వివరించారు.

శిథిలావస్థలో ఉన్న పూలుగూడ పాఠశాల మరుగుదొడ్డి

పాఠశాల మరుగుదొడ్ల మరమ్మతుకు

ఎన్ఆర్ఐ 'ప్రేమబంధు' విరాళం

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలోని అరమ పంచాయతీ పూలుగుడ ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరుకుని వినియోగానికి దూరంగా ఉన్న మరుగుదొడ్ల మరమ్మతులకు విరాళం ఇచ్చేందుకు ఎన్ఆర్ఐ ముందుకు వచ్చారు. ఇదే పాఠశాలలో సహోపాధ్యాయునిగా పనిచేస్తున్న కె.రమేష్ చొరవ, స్వచ్ఛందసంస్థల సహకారంతో పాఠశాల మరుగుదొడ్ల వినియోగానికి చర్యలు చేపట్టడంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతోంది. అందరిలా కాకుండా, కొందరిలో ఒకడిగా ఉండాలన్న తపన, తాపత్రయం, తాను పనిచేసే పాఠశాలకు విద్యార్థులకు ఎంతోకొంత మేలు చేయాలన్న సంకల్పమున్న ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుని చొరవతో ఆ పాఠశాలలోని మరుగుదొడ్లకు మంచిరోజులు వచ్చాయి. మండలంలోని అరమ పంచాయతీ పూలుగుడ ప్రాథమిక పాఠశాలలో గతంలో నిర్మించిన మరుగుదొడ్లు పాడై నిరుపయోగంగా మారాయి. వీటి మరమ్మతుకు ఇదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కె.రమేష్ చొరవ తీసుకుని స్వచ్ఛందసంస్థల సాయం కోరగా,అమెరికా ఫ్లోరిడాలోని ప్రేమబంధు స్వచ్ఛందసంస్థ నిర్వాహకురాలు సత్యకళ ముందుకొచ్చారు. నిధులను సమకూర్చి మరుగుదొడ్లను బాగుచేయించారు. అంతేకాకుండా స్వచ్ఛందసంస్థల సహకారంతో పాఠశాలలో విద్యార్థులు కూర్చొనేందుకు బెంచీలు, నోట్‌బుక్స్, పెన్నులు, ఇతర సౌకర్యాలను సమకూర్చేందుకు సహోపాధ్యాయుడు రమేష్, హెచ్ఎం ఎం.శ్రీనివాస్ కృషి చేయడంపై పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ వి.బలరాం హర్షం వ్యక్తం చేసి వారిని అభినందించారు. ఇలాంటి గురువులను స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది గిరిజనులకు సేవ చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

అందోళన చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

'వంతల'కు సీటిస్తే గెలిపించుకుంటాం

రాళ్లగడ్డలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన

ప్రజాశక్తి-చింతపల్లి: కాంగ్రెస్ పార్టీలోకి ఎంతోమంది వచ్చి, వేర్వేరు పార్టీలకు వెళ్లిపోతున్నా, మొదటినుండి పార్టీని అంటిపెట్టుకుని ఉండి, మూడు దశాబ్ధాలుగా పార్టీ కోసమే కృషి చేస్తున్న వంతల సుబ్బారావుకు పాడేరు ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించాలని పలువురు కాంగ్రెస్ నేతలు కోరారు. ఈ సందర్భంగా శనివారం రాళ్లగడ్డలో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ కోసమే అంకితభావంతో పనిచేస్తున్న వంతల సుబ్బారావుకు తప్ప వేరొకకిరి ఎమ్మెల్యే సీటు కేటాయిస్తే అల్లూరి జిల్లాలో కాంగ్రెస్‌కు కష్టకాలం తప్పదని, అధిష్టానం దీన్ని గుర్తించాలని కోరారు. పాడేరు నియోజకవర్గంలో 1.30లక్షల మంది పివిటిజిలు ఉన్నారని, వంతలకు సీటు కేటాయిస్తే, వారంతా సుబ్బారావు గెలుపునకు బాసటగా నిలుస్తారని, రాహుల్‌గాంధీకి, ఎపిసిసి అధ్యక్షురాలు షర్మిలకు పాడేరు సీటును బహుమతిగా ఇస్తామని స్పష్టం చేశారు.

ఎన్నికల నిర్వహణలో జోనల్ అధికారులు కీలకం

-జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

ప్రజాశక్తి -పాడేరు : సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడానికి సెక్టోరల్ అధికారులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం సెక్టోరల్ అధికారులకు ఎన్నికల ప్రక్రియపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులు నిర్వహించవలసిన విధి విధానాలపై తగు సూచనలు చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి ఎన్నికల సామగ్రి, ఓటింగ్ యంత్రాలు, ఎన్నికల సిబ్బందిని సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేర్చవలసిన బాధ్యత సెక్టార్ అధికారులపైనే ఉందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, అదనపు పోలీసు బలగాలను నియమిస్తున్నట్లు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలను చేపట్టాలని సూచించారు.. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, తాగు నీటి సదుపాయాలు సమకూర్చాలన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రవర్తనానియమావళి పక్కాగా అమలుచేయలన్నారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సెక్టోరల్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి సమస్యాత్మక ప్రాంతాలు, సమస్యలు సృష్టించే వారిని ముందుగానే గుర్తించి నివేదించాలన్నారు. సెక్టోరల్ అధికారులకు మెజిస్టీరియల్ వివి. పాట్‌లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్ మార్చవలసి వస్తే తప్పనిసరిగా మాక్ పోలింగ్ నిర్వహించాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేసారు. పాడేరు రిటర్నింగ్ అధికారి భావన వశిష్ట్ మాట్లాడుతూ, రిసెప్షన్ కేంద్రం మార్గం ఇరుకుగా ఉన్నందున పోలింగ్ అనంతర సామగ్రిని ప్రవేశ ద్వారం వరకు తీసుకు వచ్చి వెంటనే సంబంధిత వాహనాన్ని పార్కింగ్ ప్లేస్ కు తరలించాలని, సామగ్రి తీసుకోవటానికి ఏర్పాటు చేసిన కౌంటర్లలో దేనికి సంబంధించిన కౌంటర్లలో వాటిని అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్ఓ బి.పద్మావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వివిఎస్.శర్మ, పి.అంబేద్కర్, పాడేరు నియోజకవర్గం సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా వైద్య శిబిరాలు

రంగులోయలో వైద్యాధికారులు గైర్హాజరు
కిందిస్థాయి సిబ్బందితో మొక్కుబడి సేవలు
పెదవి విరుస్తున్న మారుమూల గ్రామాల గిరిజనులు

ప్రజాశక్తి- పెదబయలు : ప్రభుత్వ వైద్యసేవలే దిక్కుగా ఉన్న మారుమూల గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాల నిర్వహణలో నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం పోయిపల్లి పంచాయతీ రంగులోయలో ఆరోగ్యసురక్ష వైద్యశిబిరం మొక్కుబడిగా నిర్వహించడంపై స్థానిక గిరిజనులు పెదవి విరుస్తున్నారు. గోమంగి పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యాధికారులు ఉన్నప్పటికీ, రంగులోయ వైద్యశిబిరానికి ఇద్దరూ డుమ్మా కొట్టి, కిందిస్థాయి సిబ్బందితో అయిందనిపించుకుని చేతులు దులుపుకున్నారని స్థానికులు మండిపడుతున్నారు. మారుమూల గ్రామాలు కావడంతో ఎవ్వరూ అడిగే పరిస్థితి లేదనే నిర్లక్ష్యమో, గిరిజనులంటే చిన్నచూపో? లేకుంటే ఎన్నికల హడావిడిలో అందరూ ఉండడంతో తమను ఎవరు పట్టించుకుంటారులే అనే ధోరణియో తెలియదుగానీ, రంగులోయ వైద్యశిబిరం నిర్వహణలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం సరికాదని, ఇలాంటి మొక్కుబడి వైద్యశిబిరాలతో ఏం ప్రయోజనమని ప్రశ్నిస్తున్నారు. హెచ్‌వి, ఎంఎల్‌హెచ్‌పిలు వైద్యశిబిరానికి వచ్చి లెక్కకు ఒకటి పూర్తిచేశామని అనిపించుకుని వెళ్లిపోయారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వైద్యశిబిరానికి డాక్టర్లు రాలేదని తెలుసుకున్నారేమోగానీ, వైద్యపరీక్షలకు వచ్చిన వారు కూడా అంతంత మాత్రంగానే ఉండడం విశేషం ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, గ్రామాల్లో ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహించేటప్పుడు వైద్యులు, సిబ్బందితోపాటు అత్యవసర మందులతో వెళితేనే ప్రయోజనముంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రంగులోయలో నిర్వహించిన వైద్యశిబిరం

'ఉపాధి' వేతనాన్ని పెంచాలని నిరసన

ప్రజాశక్తి -కొత్తకోట : ఉపాధి హామీ పథకం కింద కూలీలకు రోజువారీ కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రావికమతం మండలంలో చీమలపాడు శివారు అజయ్‌పురంలో శనివారం ఆదివాసి గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఉపాధి కూలీల ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కె.గోవిందరావు, మండల శాఖ కార్యదర్శి చంద్రయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద ఆదివాసీ కూలీలకు కనీస రోజుకూలీ రూ.600 ఇవ్వాలని కోరుతుంటే రూ.27 మాత్రమే పెంచడం అన్యాయమన్నారు. ఏడాదిలో 100 రోజులు పని దినాలను 200 పెంచాలన్న డిమాండ్ ను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదని ఆరోపించారు. గతంలో ఇస్తున్న రూ 273 లకు మరో రూ 27 కలిపి రూ 300 ఇస్తామని ప్రకటించడం దారుణమని వాపోయారు. నరేంద్ర మోడీ గద్దెనెక్కిన తర్వాత నేటి వరకు నిత్యవసర సరుకులు ధరలు ఆకాశాన్నంటుతున్న చాలీచాలని కూలితో కుటుంబపోషణ ఎలా సాగుతుందని ప్రశ్నించారు. కనీస వేతనం చట్ట ప్రకారం రూ.400 చెల్లించాల్సి ఉండగా, మోడీ ప్రభుత్వం ప్రకటించిన ఉపాధి పథకం కూలిరేట్లు, కనీసం వేతనం చట్టం కంటే తక్కువగా ఉంద న్నారు.బడ్జెట్లో ఉపాధి పథకం నిధులు తగ్గిస్తూ. నేటికీ బకాయిలు చెల్లించకపోవడం దుర్మార్గమని, ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో పలువురు గిరిజన ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో సాగితే విజయం సాకారం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆత్మస్థైర్యంతో యువత ముందుకు సాగితే విజయం సాకారమవుతుందని ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ టిఎల్ఎన్ సభామందిరంలో జర్నలిజం విభాగం ఆధ్వర్యాన డిప్లమా ఇన్ ఫొటోగ్రఫీ కోర్సును పూర్తిచేస్తున్న విద్యార్థుల ఫొటోగ్రఫీ ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఆసక్తికి అనుగుణంగా నేటితరం యువత ముందుకు సాగుతున్నారన్నారు. ఫొటోగ్రఫీలో మెళకువలు నేర్చుకుని, ఒక వృత్తిగా ఎంపిక చేసుకుని ముందుకుసాగడం ఎంతో మంచి పరిణామమన్నారు. నేటి తరం యువతకు నైపుణ్యాలే పెద్ద వనరుగా మారి సంపదను సృష్టిస్తున్నాయన్నారు. ఏయూలోని చిత్రకళా విభాగం, సంగీత విభాగం, మ్యూజిక్ స్టూడియో, ఆర్కిటెక్చర్, జియో ఇంజినీరింగ్, జర్నలిజం విభాగం వంటివి ఒక ప్రత్యేకతను నిలపుకుంటూ ముందుకు సాగుతున్నాయన్నారు. చిత్ర ప్రదర్శనలో విద్యార్థులు తీసిన ఛాయా చిత్రాలను ప్రత్యేకంగా తిలకించి అభినందించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఏ.నరసింహారావు మాట్లాడుతూ ఏయూ విద్యార్థులు ప్రతిభావంతులన్నారు. ఫొటోగ్రఫీ, జర్నలిజం కోర్సులకు మంచి ఆదరణ ఉందని తెలిపారు. విభాగంలో వసతులను మరింత పెంచుతామని చెప్పారు. అధునాతన సాంకేతికతలతో విద్యార్థులకు తర్ఫీదును అందిస్తామన్నారు. యువతలో ప్రతిభను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో జర్నలిజం విభాగాధిపతి ఆచార్య సిఎం.వినయకుమార్, బిఒఎస్ చైర్మన్ ఆచార్య డివిఆర్.మూర్తి, ఆచార్య చల్ల రామకృష్ణ, రవికుమార్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో విభాగ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శన ఆదివారం కూడా కొనసాగుతుంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నగర ప్రజలకు ఉచిత ప్రవేశం కల్పిస్తారు.

ఏయూ విద్యార్థులకు మెరుగైన ఉపాధి

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించడం పట్ల ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల ఏయూ సౌత్ క్యాంపస్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ (ఐఎఎస్ఇ)లో బిఇడి, ఎంఇడి చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఓక్‌రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్, శ్రీ విశ్వ జూనియర్ కళాశాల, రిషి డిగ్రీ కళాశాల, భాష్యం ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్, నారాయణ విద్య సంస్థలు నిర్వహించిన ఈ నియామక ప్రక్రియకు 200 మంది విద్యార్థులు హాజరవగా 170 మంది విద్యార్థులు ఎంపికై రికార్డు సృష్టించారు. వీరికి అత్యధిక వేతనంగా రూ.6.25 లక్షలు లభించడం పట్ల వీసీ సంతోషం వ్యక్తం చేశారు. తన కార్యాలయంలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఐఎఎస్ఇ ప్రిన్సిపల్ ఆచార్య టి.శోభశ్రీ, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ విఆర్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ టెక్నాలజీ, ఆర్ట్స్-కామర్స్, పార్మశీ, న్యాయ కళాశాలల పరిధిలో 190 సంస్థలు సందర్శించగా 850 మంది విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభించాయని వీసీ తెలిపారు. సైన్స్‌కోర్సుల వారికి అత్యధికంగా రూ.13 లక్షలు, ఆర్ట్స్ కోర్సుల వారికి రూ.7.8 లక్షలు, ఫార్మశీ వారికి రూ.6 లక్షలు, న్యాయ విద్యార్థులకు రూ.4.5 లక్షలు వేతనంగా సాధించారని పేర్కొన్నారు.

అంతర్జాతీయ గణిత సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర యూనివర్సిటీలోని గణిత శాస్త్ర విభాగంలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ప్యూర్, అప్లైడ్ అండ్ ఇంజినీరింగ్ మ్యాథమెటికల్ సైన్సెస్ అంశంపై అంతర్జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. శని, ఆదివారాలు ఈ సదస్సు నిర్వహించనున్నారు. శనివారం ప్రారంభమైన సదస్సుకు డైరెక్టర్‌గా గణిత శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ పి అనురాధ కామేశ్వరి అధ్యక్షత వహించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ సిహెచ్ శ్రీనివాసరావు సదస్సు ఆవశ్యకతను, సదస్సులో పాల్గొనే వక్తలు గురించి వివరించారు. ఉత్తరాంధ్ర మ్యాథమెటికల్ సైన్సెస్ చైర్మన్ ప్రొఫెసర్ కెపిఆర్ శాస్త్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇలాంటి సదస్సులు యువ పరిశోధనకులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఉత్తరాంధ్ర మ్యాథమెటికల్ సైన్సెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేకేఎం శర్మ గౌరవ అతిథులుగా హాజరై గణితం గొప్పతనాన్ని తెలియజేశారు. ఐఐటి ఖరగ్‌పూర్ ఆచార్యులు ప్రొఫెసర్ జిపి రాజశేఖర్ మాట్లాడుతూ గణిత శాస్త్ర అనువర్తనాలపై పరిశోధన చేయడం వల్ల యూనివర్సిటీకి తద్వారా దేశానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఉత్తరాంధ్ర సొసైటీ ఫర్ మ్యాథమెటికల్ సైన్సెస్, ప్రొఫెసర్ ఎస్ మీనాక్షి సుందరం మెమోరియల్ సొసైటీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం గణిత శాస్త్ర విభాగము సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో గణిత శాస్త్ర ఆచార్యులు ప్రొఫెసర్ పిడిఎన్ శ్రీనివాసు, ప్రొఫెసర్ జి.నానాజీరావు, ప్రొఫెసర్ ఎస్.రవికుమార్, ప్రొఫెసర్ ఎన్.రామకృష్ణ, విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ కెఎల్ఎన్ స్వామి, ప్రొఫెసర్ జిసి రావు, ప్రొఫెసర్ ఎన్‌విఎస్.మూర్తి, వివిధ కళాశాలల అధ్యాపకులు, వివిధ యూనివర్సిటీల రీసెర్చ్ స్కాలర్లు హాజరయ్యారు.

చర్చల్లో పాల్గొన్న యూనియన్ నాయకులు, ఉబర్ మేనేజర్ యశ్వంత్

ఉబర్ డ్రైవర్ల సమ్మె విజయవంతం

- సిఐటియు అభినందనలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉబర్ క్యాబ్ డ్రైవర్లు విశాఖ నగరంలో నిర్వహించిన సమ్మె విజయవంతమైనది. సమ్మెలో ఏడు డిమాండ్లను ప్రతిపాదించగా ఐదు డిమాండ్లకు యాజమాన్యం అంగీకరించటంతో సమ్మెను విరమించినట్లు విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.పోలినాయుడు, అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాసు మీడియాకు తెలిపారు. ఉబర్ సమ్మెలో పాల్గొన్న డ్రైవర్లందరికీ సంఘం తరపున అభినందనలు తెలిపారు. ఉబర్ యాజమాన్యం శనివారం యూనియన్‌తో చర్చలు జరిపిందన్నారు. పరిష్కరించబడ్డ డిమాండ్లను ఆయన మీడియాకు వివరించారు. కొత్తగా తీసుకుని వచ్చిన ప్లాట్ ఫామ్ ఫీజు రోజుకు రూ.39 రద్దు చేయబడిందని తెలిపారు. ప్రారంభంలో కనీస రేట్లు ఉబర్ గోకి రూ.60 నుంచి 82కి, ప్రైమ్‌కి రూ.71 నుంచి 92కి పెంచారన్నారు. నైట్ ఛార్జెస్ రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు 50 శాతం పెంచాలని యూనియన్ కోరగా 25 శాతం పెంపునకు అంగీకారం తెలిపారన్నారు. ఇంటర్ సిటీ రేట్లు 10 శాతం పెంచారన్నారు. ఎస్‌యువిలు కొద్ది రోజులలో ప్రారంభిస్తామని చెప్పారన్నారు. మిగిలిన రెండు డిమాండ్లయిన వే బిల్లు చూపించడం, మైనస్ బ్యాలెన్స్ వెయ్యి రూపాయలకు పెంచడంపై యాజమాన్యంతో మాట్లాడుతామని చర్చల సందర్భంగా ఉబర్ మేనేజర్ యశ్వంత్ హామీ ఇచ్చారన్నారు. చర్చల్లో సిఐటియు విశాఖ క్యాబ్ డ్రైవర్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ శ్రీనివాసు, కె.పోలినాయుడు, నాయకులు సిమ్మ శ్రీను, ఆనంద్, నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారన్నారు. ఐక్య పోరాటం వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు.

స్క్రాప్ అమ్మకాల్లో వాల్తేరు డివిజన్ రికార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ స్క్రాప్ అమ్మకాల్లో రికార్డు సృష్టించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డివిజన్ రూ.161.53 కోట్లు విలువైన స్క్రాప్ అమ్మకాలు సాగించింది. గత ఏడాది ఆర్జించిన రూ.94.42 కోట్లతో పోలిస్తే ఇది 71.5 శాతం అధికం. ఈ సందర్భంగా వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ రికార్డు సాధనకు కారణమైన మెటీరియల్ మేనేజ్‌మెంట్, సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్, క్యారేజ్ అండ్ వ్యాగన్, లోకో షెడ్స్, ఫైనాన్స్ తదితర విభాగాల సిబ్బందిని అభినందించారు.

టిడిపి జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన బాబ్జీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇటీవల విశాఖపట్నం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నియమింపబడిన గండి బాబ్జీ శనివారం జిల్లా టిడిపి కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. టిడిపి నేతలు ఆయనతో ప్రమాణం చేయించి అధ్యక్ష స్థానంలో కూర్చొబెట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో పార్టీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు చేపట్టిన బాబ్జీకి అభినందనలు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలపై ఐక్య పోరాటాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటంలో అన్ని సంఘాలూ ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎపి ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కెవి.శివారెడ్డి పిలుపునిచ్చారు. ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గంలో నూతన అధ్యక్షునిగా శివారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చౌదరి పురుషోత్తమ నాయుడు ఎన్నికై నగరానికి వచ్చిన సందర్భంగా వారిని అభినందించే కార్యక్రమం శనివారం జిల్లా పరిషత్ అసెంబ్లీ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా వారిని అసోసియేషన్ జిల్లా నాయకులు పెద్ద ఎత్తున సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

సిఎం రమేష్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

ఉక్కుపై ఆయన కల్లబొల్లి కబుర్లను ప్రజలు నమ్మరు
సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కానివ్వబోమని, పరిశ్రమకు అవసరమైన సొంత గనులు, నిధులు రప్పించి ఆధునికీకరించి ఉపాధి కల్పిస్తామని, మూసివేసిన సుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని, ప్రతి నియోజకవర్గంలో పరిశ్రమలు నిర్మిస్తామని అనకాపల్లిలో శుక్రవారం జరిగిన సభలో బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ ప్రకటించడం చాలా హాస్యాస్పదంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పేర్కొన్నారు. సిఎం రమేష్ చేసిన వ్యాఖ్యలపై ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత పదేళ్ళగా ఎంపీగా వుండి రమేష్ చేసిందేమిటన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామని కేంద్ర బిజెపి ప్రభుత్వం చెబుతుంటే దానిని ఆపడంలో మీ పాత్ర ఏమిటి ? ఈ పదేళ్ళలో మీరు అధికారంలో వుండి ప్లాంట్ పరిరక్షణకు, సొంత గనులు కేటాయించడానికి, వర్కింగ్ క్యాపిటల్‌ను ఇప్పించడంలో మీరు చేసిన కృషి ఏమిటి ? అని ప్రశ్నించారు. ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సుదీర్ఘకాలంగా కార్మికులు, ప్రజలు చేపడుతున్న పోరాటానికి సంఘీభావం కూడా ప్రకటించలేదన్నారు. ఎన్నడూ ప్రైవేటీకరణ నిలిపివేయడానికి జోక్యం చేసుకోని సిఎం రమేష్ ఎన్నికలు ముందుకు వచ్చేసరికి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేస్తామని మాట్లాడడం అంటే ప్రజలను మోసం చేయడమే అవుతుందన్నారు. ఉత్తరాంధ్ర వాసులకు చదువురాదు, చక్కగా మాట్లాడలేరని భాషను ఉటంకిస్తూ తనను గెలిపిస్తే చక్కగా మాట్లాడతానని అవహేళన చేసే విధంగా వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. ప్రతి ఏడాదీ రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోడీ యువతను మోసం చేశారన్నారు. ఇప్పుడు అనకాపల్లి ఎంపీగా తనను గెలిపిస్తే ప్రతి నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తామని సిఎం రమేష్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అసలు సుగర్ ఫ్యాక్టరీలు మూతపడడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. అటువంటప్పుడు మరలా మూసివేసిన సుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పడాన్ని ప్రజలు ఎవ్వరూ విశ్వసించబోరన్నారు.

కేంద్ర బిజెపి ప్రభుత్వం పదేళ్ల నుంచి ఆంధ్ర రాష్ట్రానికి, ఉత్తరాంధ్రకు, ముఖ్యంగా ఉమ్మడి విశాఖపట్నం ప్రజలకు తీవ్ర ద్రోహం చేస్తోందన్నారు. విశాఖ మెట్రో రైలుకు అతీగతీ లేకుండా పోయిందన్నారు. రైల్వేజోన్ ఇవ్వకుండా కుంటిసాకులు చెబుతున్నారని తెలిపారు. గంగవరం పోర్టును అదానీకి అప్పజెప్పడంలో కేంద్ర బిజెపి కీలకంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా అన్యాయం చేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిధులు కేటాయించలేదని తెలిపారు. ఉత్తరాంధ్ర జీవనాడిగా పేరొందిన సుజల స్రవంతి ప్రాజెక్టు నేటికీ పూర్తికాని విషయాన్ని లోకనాథం గుర్తుచేశారు. విభజన చట్టంలో పేర్కొన్న ఏ అంశాన్నీ అమలు చేయకుండా ద్రోహం చేశారన్నారు. కడప స్టీల్‌ప్లాంట్ కోసం, విభజన హామీలకు కోసం పోరాటం చేశానన్న సిఎం రమేష్ ఈ ఐదేళ్ళ కాలంలో రాజ్యసభ సభ్యునిగా బిజెపి ప్రభుత్వంలో వుండి ఏ ఒక్క అంశంపైనా ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఇప్పుడు ఇంత హఠాత్తుగా అనకాపల్లిపై ప్రేమ చూపించడమంటే తమ రాజకీయ ప్రయోజనాలకు తప్ప ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం కాదనేది స్పష్టమవుతోందన్నారు. అనకాపల్లి ప్రాంతంలో లక్షల కోట్లు విలువ చేసే భూములు, సహజ వనరులున్నాయని, వీటన్నింటినీ కొల్లగొట్టడానికి వీరు వస్తున్నారు తప్ప ఈ ప్రాంత అభివృద్ధి కోసం కాదనేది ప్రజలందరూ అర్థం చేసుకోవాలని కోరారు. ఆంధ్ర రాష్ట్రానికి అన్నింటా అన్యాయం చేసిన బిజెపితో జతకట్టిన తెలుగుదేశం, జనసేన పార్టీలకు ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.

ఘనంగా ఐఐఎం విశాఖ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎం) ఎనిమిదో స్నాతకోత్సవం శనివారం సాయంత్రం బీచ్‌రోడ్‌లోని నొవొటల్ హోటల్‌లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా యాక్సిస్ బ్యాంక్ ఎమ్‌డి అండ్ సిఇఒ అమితాబ్ చౌదరి హాజరై ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలను, డిగ్రీ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఐఐఎం డైరెక్టర్ ఎం.చంద్ర శేఖర్ మాట్లాడుతూ గడచిన ఎనిమిదేళ్లుగా సంస్థ సాధించిన విజయాలను వివరించారు. ఈ విద్య సంవత్సరంలో 301 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, ఇందులో పిజిపిలో 271, డిజిఎంలో 15 మంది ఉన్నారని తెలిపారు. ఇటీవలే తమ సంస్థ నూతన భవనంలో పూర్తిస్థాయిలో కార్యక్రమాలు ప్రారంభించిందని తెలిపారు.

అమితాబ్ చౌదరి మాట్లాడుతూ ఐఐఎం వంటి ఉన్నత విద్యా సంస్థలలో విద్యను అభ్యసించిన వారు ఇప్పటికే దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని తెలిపారు. భారతదేశ ఖ్యాతిని వ్యాపింపజేస్తున్నారన్నారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బంగారు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ హరి భాటియా, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థికి పట్టా అందజేస్తున్న అమితాబ్ చౌదరి

ఉత్తమ విద్యార్థులు వీరే

పిజిపి విభాగంలో మొదటి ర్యాంక్‌ను అంకిత్ శెట్టి, రెండో ర్యాంకును దుష్యంత్ గుప్తా, మహిళల విభాగంలో మొదటి ర్యాంకును స్తుతి సంఘీ సాధించారు. పిజిపిఈఎక్స్ విభాగంలో మొదటి ర్యాంకును గల్లా సత్య అప్పారావు, రెండో ర్యాంకును వడ్డాది అభిమన్యు సాధించారు. పిజిపిడిజిఎం విభాగంలో మొదటి ర్యాంకును సుశాంత్ కంద్వల్, రెండో ర్యాంకును లోకేష్ గుప్తా సాధించారు. ఆల్ రౌండ్ బెస్ట్ పెర్ఫార్మన్స్‌గాను దుష్యంతు గుప్తాకు గోల్డ్ మెడల్ లభించింది.

ప్రాక్టీస్ చేస్తున్న క్రికెటర్లు

ఐపిఎల్ పోరుకు సర్వం సిద్ధం

- నేడు విశాఖలో తలపడనున్న డిసి-సిఎస్‌కె

ప్రజాశక్తి - పిఎం.పాలెం : విశాఖలో ఐపిఎల్ క్రికెట్ పండగ మొదలైంది. పిఎం.పాలెం సమీపంలోని ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియం వేదికగా ఆదివారం సాయంత్రం 7:30 గంటలకు ఢిల్లీ క్యాపిటల్ - చెన్నయ్ సూపర్ కింగ్స్ జట్ల మధ్య ఐపిఎల్ మ్యాచ్ జరుగనుంది. ఇప్పటికే ఈ మ్యాచ్‌కి సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎసిఎ సెక్రటరీ గోపీనాథ్ రెడ్డి వెల్లడించారు. ఆదివారం జరిగే మ్యాచ్‌లో ధోనీని చూసేందుకు అభిమానులు భారీగా వచ్చే అవకాశముందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే టిక్కెట్లన్నీ ఆన్‌లైన్లో హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి.

ఇరు జట్లూ ప్రాక్టీస్

శనివారం సాయంత్రం ఐదు గంటల నుండి రాత్రి 9 వరకు స్టేడియం ఆవరణలో ఇరు జట్లూ ప్రాక్టీస్ చేశాయి. అదే విధంగా ఐపిఎల్ మ్యాచ్ సందర్భంగా ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్ రెడ్డి, విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ రవిశంకర్ శనివారం సాయంత్రం క్రికెట్ స్టేడియం లోపల, బయట కల్పించనున్న భద్రతపై స్థానిక పోలీస్ అధికారులతో చర్చించారు. ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

వికలాంగుల పాఠశాలకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వికలాంగుల పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించాలని సన్ ఫ్లవర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఎంఎన్.కుమారి విజ్ఞప్తి చేశారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సన్ ఫ్లవర్ ఎడ్యుకేషనల్ సొసైటీని 1986లో స్థాపించామని తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఒఎస్) పదో తరగతి నిర్వహణకు గుర్తింపు ఇచ్చినట్లు తెలిపారు. డ్రాపౌట్స్ నివారణ కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. తాము చేస్తున్న సేవలను తెలియజేశారు. ఇంత వరకూ రాష్ట్ర ప్రభుత్వం తమకు స్థలం కేటాయించలేదని విచారం వ్యక్తం చేశారు. స్వచ్ఛంద సేవా సంస్థలకు ప్రభుత్వం భూమి కేటాయించాలని ప్రభుత్వ జిఒ కూడా వుందని ఆమె గుర్తు చేశారు. సమావేశంలో సొసైటీ సలహాదారు ఎంవి.రాజశేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి పాల్గొన్నారు.

చర్చి స్థలాన్ని ఏడు రోజుల్లో అప్పగించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని సిరిపురంలోగల 18 వేల గజాల చర్చి స్థలాన్ని ఎంపీ ఎంవివి.సత్యనారాయణ ఆక్రమించుకున్నారని, దీని విలువ రూ.550 కోట్లు ఉంటుందని, వారం రోజుల్లోగా ఆ స్థలాన్ని ఆయన చర్చి నిర్వాహకులకు అప్పగించాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కెఎ.పాల్ డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా స్థలాన్ని ఖాళీ చేసి అప్పగించకపోతే తాను న్యాయపోరాటం చేస్తానని హెచ్చరించారు. ఆశీలుమెట్టలోని తన ఫంక్షన్ హాలులో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చిట్టివలస జ్యూట్ మిల్లును కూడా వైసిపి నేతలు ఆక్రమిస్తున్నారని మండిపడ్డారు.

గాయత్రిలో అస్త్రా సమావేశాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రాంగణంలో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ స్టూడెంట్స్ మీట్ అస్త్రా సమావేశాలు శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఇసాయి ఫార్మాస్యూటికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అండ్ హెడ్ ఆఫ్ సైట్ లొకేషన్ డాక్టర్ గిరీష్ దీక్షిత్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మాస్యూటికల్ పరిశ్రమ గతిశీలత విజయానికి కీలకమైన నిర్వహణ వ్యూహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గాయత్రీ విద్యా పరిషత్ సభ్యులు ప్రొఫెసర్ పివి.శర్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రజిని పాల్గొన్నారు.